సాక్షి
రంగారెడ్డి
గురువారం । 25 । ఏప్రిల్ । 2024



కంకర వేశారు..
చిలుకూరు నుంచి సురంగల్ వరకు బీటీరోడ్డు నిర్మాణానికి సంబంధించి కంకర పోసి వదిలేశారు. 10లో▸



బీజేపీతోనే దేశాభివృద్ధి
నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము. ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. 10లో▸



ఔటర్ సర్వీస్‌పై వ్యాన్ దగ్ధం
బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై ఓమిని వ్యాన్ దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. 10లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా వెంకటగిరిలో గల 'ప్రగాఢ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ టెక్నాలజీ' యందు హ్యాండ్లూమ్స్ టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత జౌళిశాఖ రంగారెడ్డి జిల్లా సహాయ సంచాలకులు ఇందిర బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. మొదటి సంవత్సరం డిప్లమా కోర్సులో ప్రవేశానికి సంబంధించి 9 సీట్లకు గాను తెలంగాణ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ యేడాది జూన్ 10వ తేదీలోపు.. ప్రిన్స్‌పాల్ ఎస్‌పీకేఎం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ టెక్నాలజీ, వెంకటగిరి-524132 చిరునామాకు పంపించాలని ఆయన కోరారు.

నామినేషన్లకు నేడే ఆఖరు

రంజిత్‌రెడ్డికి మద్దతుగా సీఎం రోడ్ షో

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ స్థానాలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం నేటితో ముగియనుంది. రాజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆఖరి రోజు కావడంతో ఇప్పటికే ఒకటి, రెండు సెట్లు దాఖలు చేసిన అభ్యర్థులు మిగిలిన సెట్లను కూడా దాఖలు చేసే అవకాశం ఉంది. బుధవారం చేవెళ్ల లోక్‌సభ స్థానానికి 18 మంది అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శశాంక వెల్లడించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం అత్తాపూర్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి తుది నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి సహా ఇతర ప్రముఖులు హాజరు కానుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అత్తాపూర్ పిల్లర్ నంబర్ 154 నుంచి రాజేంద్రనగర్ అంబేడ్కర్ విగ్రహం వరకు మధ్యాహ్నం వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించనున్నారు. రోడ్‌షోకు పార్టీ శ్రేణులను పెద్ద సంఖ్యలో తరలించేందుకు నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాలు భళా

సత్తాచాటిన జిల్లా విద్యార్థులు
- ఫస్టియర్‌లో మొదటి స్థానం
- సెకెండియర్‌లో మూడో స్థానం
- ఓవరాల్‌గా బాలికలదే పైచేయి
- గతంతో పోలిస్తే పెరిగిన ఉత్తీర్ణత
- సర్కారు కాలేజీల్లో ఉత్తమ ఫలితాలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయి ఫస్ట్ ర్యాంకు(బైపీసీ)తో పాటు 71.07 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవగా సెకండియర్‌లో 77.63 శాతం ఉత్తీర్ణతతో మూడో స్థానంలో నిలిచారు. గత ఏడాదితో పోలిస్తే ఫలితాలు కొంత మెరుగుపడటం విశేషం. ప్రథమ, ద్వితీయసంవత్సర ఫలితాల్లో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలే అత్యధిక మార్కులు సాధించారు. జిల్లాలోని కేజీబీవీ, ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీల విద్యార్థులు.. కార్పొరేట్ కాలేజీలకు ఏమాత్రం తీసిపోకుండా ఉత్తమ ఫలితాలు సాధించారు. రాష్ట్రంలోనే జిల్లాను టాప్‌లో నిలిపారు. ఇక ఒకేషనల్ కోర్సుల్లో ఫస్ట్ ఇయర్‌లో మొత్తం 3,580 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 1,819 మంది ఉత్తీర్ణత (50.81%) సాధించారు.అదే విధంగా సెకండ్ ఇయర్‌లో 3,094 మంది పరీక్షలు రాయగా 1,919 మంది ఉత్తీర్ణత (62.02%) సాధించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు, అదేవిధంగా రీకౌంటింగ్, రీ వాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకునే వారు ఏప్రిల్ 25 నుంచి మే 2 వరకు ఫీజు చెల్లించొచ్చని బోర్డు ప్రకటించింది.

మెరుగు పడిన ఫలితాలు..

గత ఐదేళ్లతో పోలిస్తే జిల్లాలో ఫస్ట్, సెకండ్ ఇయర్ వార్షిక ఫలితాలు కొంత మెరుగుపడ్డాయి. 2023లో ఫస్ట్ ఇయర్‌లో 73 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించగా, ప్రస్తుతం 71.7 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచాం. సెకండ్ ఇయర్‌లోనూ ఇదే జోరు కన్పించింది. 2023లో 73 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించగా, ప్రస్తుతం 77.63 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించాం.

జిల్లాలో ఉత్తీర్ణత శాతం ఇలా..

ఇంటర్మీడియెట్	మొత్తం	ఉత్తీర్ణత	శాతం
ప్రథమ సంవత్సరం	71,297	51,121	71.07
ద్వితీయ సంవత్సరం	64,759	50,273	77.63

బాలుర ఉత్తీర్ణత శాతం

ఇంటర్మీడియెట్	బాలురు	ఉత్తీర్ణత	శాతం
ప్రథమ సంవత్సరం	37,576	25,242	67.18
ద్వితీయ సంవత్సరం	33,859	25,069	74.4

బాలికల ఉత్తీర్ణత శాతం

ఇంటర్మీడియెట్	బాలికలు	ఉత్తీర్ణత	శాతం
ప్రథమ సంవత్సరం	33,721	25,879	76.74
ద్వితీయ సంవత్సరం	30,900	25,204	81.57

ఫస్ట్ ఇయర్ ఫలితాలు (గత ఐదేళ్ల వివరాలు)

సంవత్సరం	విద్యార్థులు	ఉత్తీర్ణత	శాతం	ర్యాంకు
2024	71,297	51,121	71.7	1వ
2023	68,289	50,433	73	2వ
2022	56,359	41,056	72	3వ
2021	53,619	32,328	60	2వ
2020	62,456	43,958	70	2వ

సెకండ్ ఇయర్ ఫలితాలు (గత ఐదేళ్ల వివరాలు)

సంవత్సరం	విద్యార్థులు	ఉత్తీర్ణత	శాతం	ర్యాంకు
2024	64,759	50,273	77.63	3వ
2023	53,050	38,911	73	5వ
2022	52,265	39,410	75	3వ
2021	55,829	55,829	100	4వ
2020	57,638	41,076	71	4వ



బహిరంగ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- మరోసారి బీజేపీకి అధికారం ఇస్తే రాజ్యాంగం మార్చే కుట్ర
- తలకొండపల్లి రోడ్‌షోలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

తలకొండపల్లి: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో తరిమికొట్టాలని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలో జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షో పాల్గొన్న ఆర్‌ఎస్‌పీ మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పే కాంగ్రెస్, రాజ్యాంగాన్ని మార్చుతాంటున్న బీజేపీ మాటలు నమ్మవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కారుగుర్తుకు ఓటు వేసి తనను పార్లమెంట్‌కు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, మాజీ సర్పంచ్‌లు లలితాజ్యోతయ్య, గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్‌నాయకులు, ఆర్‌ఎస్‌పీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ ఫ్రమ్ హోమ్

- వయోవృద్ధులు, దివ్యాంగులకు వెసులుబాటు
- జిల్లా సంక్షేమాధికారి పద్మజ రమణ



ఓటరు అవగాహన ర్యాలీలో అధికారులు, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసిందని జిల్లా సంక్షేమాధికారి పద్మజ రమణ పేర్కొన్నారు.ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు బుధవారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్తు కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా పద్మజ రమణ మాట్లాడుతూ.. దివ్యాంగులకు, 85 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు ఇంటివద్దే ఓటువేసే వసతి కల్పించామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, ట్రైసైకిల్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ అనిత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ క్రాంతి, సీడీపీఓ శాంతిశ్రీ, సూపర్‌వైజర్లు సత్తమ్మ, తులసి, కల్పన, టీచర్లు పాల్గొన్నారు.

శం'షేర్'

శంషాబాద్ విమానాశ్రయంలో పెరిగిన రద్దీ

1.76 లక్షల విమానాల రాకపోకలు

మెట్రో నగరాల్లో నాలుగో స్థానం

దక్షిణాదిలో బెంగళూరు తర్వాత హైదరాబాదే


ఏడాదిలో 2.5 కోట్ల మంది ప్రయాణం

ఒక్క రోజులో 544 విమానాల రాకపోకలతో రికార్డు

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా తాజా నివేదికలో వెల్లడి


మెట్రో నగరాల్లోని విమానాశ్రయాల్లో ప్రయాణికుల రద్దీ: (కోట్లలో)

(జాతీయ, అంతర్జాతీయ విమానాలు కలిపి)



విమానాల రాకపోకల సంఖ్య: (లక్షల్లో)


(జాతీయ, అంతర్జాతీయ విమానాలు కలిపి)



సాక్షి స్పెషల్ స్టోరీ

2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 2.5 కోట్ల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించారు. 2022-23లో 2 కోట్ల మంది ప్రయాణికులతో పోలిస్తే ఇది 19 శాతం ఎక్కువ. కరోనా కంటే ముందు 2018-19లో 2.1 కోట్ల మంది ప్రయాణించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 2023-24లో 1.76 లక్షల విమాన సర్వీసులు రాకపోకలు సాగించాయి. 2022-23లో 1.6 లక్షలు, కరోనా కంటే ముందు 2018-19లో 1.79 లక్షలుగా ఉన్నాయి. కార్గో కార్యకలాపాలను చూస్తే.. 2023-24లో 1.54 లక్షల మెట్రిక్ టన్నులు కార్గో సేవలను నిర్వహించింది. క్రితం ఏడాదితో పోలిస్తే ఇది 8 శాతం ఎక్కువ.

విమాన యానం ఊపందుకుంటోంది. ద్వితీయ శ్రేణి నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభం కావడం.. కొన్ని నగరాలకు సర్వీసుల సంఖ్య పెరగడంతో ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. విద్య, వైద్యం, ఉద్యోగం, తీర్థ, పర్యాటక యాత్రలకు వెళ్లే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరగడంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల రాకపోకలతో కిటకిటలాడుతోంది. ఈ నేపథ్యంలో దేశంలోని మెట్రో నగరాల్లో ప్రయాణికుల రద్దీలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలవగా.. దక్షిణాదిలో బెంగళూరు తర్వాత శంషాబాద్ బిజీ విమానాశ్రయంగా నిలిచిందని జాతీయ విమానయాన ప్రాధికార సంస్థ (ఏఏఐ) తాజాగా గణాంకాలు వెల్లడించింది. – సాక్షి, సిటీబ్యూరో





ఉడాన్‌తో రయ్ రయ్..

సామాన్యులకు సైతం విమాన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఉడాన్ పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ స్కీమ్ కింద దేశంలోని చిన్న పట్టణాలు, నగరాలలో విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి గమ్యస్థానాల సంఖ్య పెరిగింది. గతంలో బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి మెట్రో నగరాలకు మాత్రమే ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. ఉడాన్ పథకం తర్వాత హైదరాబాద్ నుంచి వారణాసి, అమృత్‌సర్, గోరఖ్‌పూర్, అయోధ్య వంటి చిన్న పట్టణాలకు కూడా విమాన సౌకర్యం కలిగింది. దీంతో విమాన సర్వీసుల రాక కూడా ప్రయాణికుల సంఖ్య పెరగడానికి దోహదపడుతోంది.

పెరిగిన అంతర్జాతీయ ప్రయాణికులు, విమానాలు

హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అంతర్జాతీయ ప్రయాణికులు, విమాన సర్వీసుల సంఖ్య ఏటా క్రమేణా పెరుగుతోంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 5.73 లక్షల మంది అంతర్జాతీయ ప్రయాణీకులు ప్రయాణించగా.. 2021-22లో 14.15 లక్షల మంది, 2022-23లో 34.20 లక్షల మంది, 2023-24లో 42.14 లక్షల మంది రాకపోకలు సాగించారు.

- 2023- 24లో 27,995 అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించగా.. గత ఏడాది వీటి సంఖ్య 22,957గా ఉంది. అంటే ఏడాది కాలంలో అంతర్జాతీయ విమాన సర్వీసులు 21.9 శాతం పెరిగాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరగడంతో గగన యానానికి భారీ డిమాండ్ ఏర్పడింది.
- ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, దుబాయ్, థాయిలాండ్, వియత్నాం వెళ్లే వారి సంఖ్య భారీగా పెరిగింది. విదేశాల నుంచి భాగ్యనగరానికి వచ్చే విదేశీయుల సంఖ్యలోనూ వృద్ధి కనిపిస్తోంది. వైద్య చికిత్సలు, తీర్థ, పర్యాటక ప్రాంతాలకు తాకిడి పెరగడంతో విమానాలు పూర్తిస్థాయి ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. గతేడాది డిసెంబర్ 23న ఒక్క రోజే హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 77 వేల మంది గమ్యస్థానాలకు చేరారు. ఈ ఏడాది మార్చి 30న ఒక్క రోజులో 544 విమానాల రాకపోకలు సాగించడం రికార్డు.

ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్

భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్



రథోత్సవంలో క్యామ మల్లేశ్, బీఆర్‌ఎస్ శ్రేణులు

యాచారం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఐదునెలల కాలానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ విమర్శించారు. యాచారం మండల పరిధి నల్లవెల్లిలోని శ్రీ బొగ్గుల గట్టు సీతారామచంద్రస్వామి రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు హాజరైన క్యామ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ... అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఐదు నెలలుగా కాలయాపన తప్ప చేసిందేమీ లేదన్నారు. పల్లెల్లో బీజేపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి జరిగిందన్నారు. కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. కాగా రథోత్సవంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, నాయకులు యాదయ్య, రాములు, లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ఆర్డీఓ సూరజ్‌కుమార్

కందుకూరు: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ కోరారు. బుధవారం కందుకూరులోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయన పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు, పోలింగ్ శాతం పెరిగేలా ఓటర్లను చైతన్య పరచడం, ఫారం 6, 7 మరియు 8 ప్రక్రియ, ఓటరు సమాచార పత్రాల పంపిణీ, 1600 మంది కంటే ఓటర్లు ఎక్కువ ఉన్నచోట సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి వాటి గురించి వివరించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు పూర్తయ్యే వరకు అధికారులకు సహకరించాలని కోరారు. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సహాయంతో ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై చిలుకూరు బాలాజీ



మొయినాబాద్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చిలుకూరు బాలాజీ అశ్వ వాహనంపై ఊరేగారు. చిలుకూరు గ్రామంలో స్వామి వారికి కుడుకలు, టవాల్‌లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి మహాభిషేకము, ఆస్థాన సేవ, ధూప్‌సేవ, పుష్పాంజలి సేవ అందించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నర్సింహన్, కన్నయ్య, కిట్టు, సురేష్ పాల్గొన్నారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు

రెండేళ్ల క్రితం బీటీరోడ్డు పనులకు అప్పటి మంత్రులు శంకుస్థాపన చేశారు. ఏడాది క్రితం పనులు మొదలు పెట్టారు. ఎన్నికల ముందు మరింత హడావుడి చేసి వంద మీటర్ల దూరం బీటీ రోడ్డు వేశారు. ఆ తరువాత పూర్తిగా వదిలేశారు. ఇదీ చిలుకూరు–మొయినాబాద్ బీటీ రోడ్డు పనుల దుస్థితి.

- అసంపూర్తిగా చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


కంకర పోసి వదిలేసిన చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు


రోడ్డు దుస్థితి..

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరు నుంచి వయా మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2022 మార్చి 13న అప్పటి మంత్రులు బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఏడాదికి కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను మొదలు పెట్టారు. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు కంకర పోసి, బీటీరోడ్డు వేయడానికి ఆరు నెలల సమయం పట్టింది. కానీ మొయినాబాద్ నుంచి చిలుకూరు వరకు మాత్రం అప్పట్లో పనులు మొదలు పెట్టలేదు. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది.

ఎన్నికల ముందు హడావుడి..

చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు రోడ్డు పనులను ఎన్నికల ముందు హడావుడిగా మొదలు పెట్టారు. ఎన్నికలకు పదిరోజుల ముందు నుంచి చిలుకూరు నుంచి కొంత దూరం వరకు రోడ్డుపై కంకర వేశారు. ఎన్నికలకు ఒక రోజు ముందు వంద మీటర్ల దూరం బీటీరోడ్డు సైతం వేశారు. ఆ తరువాత రోడ్డు పనులను పూర్తిగా నిలిపేశారు. ఎన్నికలు పూర్తయి ఐదు నెలల కావొస్తోంది. ప్రస్తుతం మళ్లీ లోక్‌సభ ఎన్నికలు వస్తున్నాయి. అయినా కాంట్రాక్టర్ మాత్రం పనులు చేపట్టడం లేదు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే బీఆర్‌ఎస్ నేతలు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి ఎన్నికల ముందు పనులు చేయించారని.. ఓటింగ్‌కు ఒక రోజు ముందు కొంత దూరం బీటీరోడ్డు వేయించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల తరువాత పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు చిత్తశుద్ధిలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నాణ్యతా లోపం

మొదటగా కాంట్రాక్టర్ సురంగల్ నుంచి పనులు మొదలుపెట్టారు. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు సుమారు 3.5 కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు వేశారు. కానీ నాణ్యతాలోపంతో నెల రోజులకే పెచ్చులు లేసింది. కేవలం వంద మీటర్ల దూరం మాత్రం బీటీరోడ్డు వేశారు. రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రోడ్డు వెంబడి దుమ్ములేస్తోంది.

ఇబ్బంది పడుతున్నాం



చిలుకూరు నుంచి వయా మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో పనులు జరగడం లేదు. ఎన్నికలకు ఒకరోజు ముందు హడావుడిగా వంద మీటర్ల దూరం బీటీరోడ్డు వేశారు. ఆ తరువాత పనులే చేయడం లేదు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– గరుగు రాజు, చిలుకూరు, మొయినాబాద్

త్వరలోనే పనులు చేయిస్తాం



చిలుకూరు–సురంగల్ రోడ్డు పనులు చేయడంలో కాంట్రాక్టర్ కొంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఇప్పటికే కాంట్రాక్టర్‌కు చాలా సార్లు చెప్పాం. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు వేసిన బీటీరోడ్డు నాణ్యత లేదని గుర్తించాం. అందుకే ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. మిగతా పనులు కూడా త్వరలోనే పూర్తి చేయిస్తాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ, మొయినాబాద్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కొందుర్గు: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం రాత్రి జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనంపల్లి గ్రామానికి చెందిన వనం వెంకటయ్య(64) లాల్‌పహాడ్‌లో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అంజమ్మ, కుమారులు అంజయ్య, జంగయ్య ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సత్రమ్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

అనంతగిరి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మండలం సిద్దులూర్ గ్రామానికి చెందిన ఉమ్మెంతల గోపాల్ (46) శేరిలింగంపల్లిలో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకుని లింగంపల్లిలో రైలు ఎక్కాడు. రైలులో ప్రయాణిస్తూ వికారాబాద్-చిట్టిగడ్డ రైల్వేస్టేషన్ మధ్య ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


ఖదేజా భాను (ఫైల్)

మొయినాబాద్: రాత్రి ఇంట్లో నిద్రించిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన అర్షద్‌మియ, అతని భార్య ఖదేజా భాను(20)తో కలిసి మండలంలోని అజీజ్‌నగర్‌లో ఉంటూ ఫ్లోరింగ్ పనిచేస్తున్నాడు. కాగా మంగళవారం రాత్రి భార్య, భర్తలు భోజనం చేసి ఇంట్లో పడుకున్నారు. అర్షద్‌మియ తెల్లారి లేచి చూసే సరికి భార్య ఖదేజా భాను కనిపించలేదు. ఆమె మొబైల్‌కు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అర్షద్‌మియ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

టాక్సీ డ్రైవర్ల ఆందోళన

అద్దెకు పిలిచి సతాయించడంతో తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన

షాద్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వాహనాలను అద్దెకు పిలిచి సతాయించారని ఆరోపిస్తూ బుధవారం టాక్సీ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట డ్రైవర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. వాహనాల కోసం తహసీల్దారు కార్యాలయం నుంచి పిలుపు అందుకున్న వాహనదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే వేచి ఉన్నారు. తీరా సాయంత్రానికి రెవెన్యూ సిబ్బంది వచ్చి వెళ్లి పోవాలని చెప్పడం ఎంత వరకు సమంజమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన చేపట్టిన ట్యాక్సీ డ్రైవర్లు కార్యాలయంలోకి ఎవరూ వెళ్లకుండా కార్యాలయం ముందు అడ్డుగా వాహనాలను పెట్టి నిరసన తెలిపారు. ఈ రోజుకు సరిపడ అద్దె చెల్లిస్తామని తహసీల్దారు పార్థసారధి చెప్పడంతో డ్రైవర్లు ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కేస్లీతండాకు చెందిన రమావత్ పెంటి(55) కుటుంబ సభ్యులతో కలిసి సంతోషనగర్‌లో నివాసం ఉంటున్నారు. మాల్ కేంద్రంలోని ఓ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు నగలను విడిపించుకోవడానికి బుధవారం తన చిన్న కుమారుడు అమర్‌సింగ్‌తో కలిసి ఆటోలో మాల్‌కు వస్తున్నారు. అదే క్రమంలో మాల్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఓ గుర్తు తెలియని కారు తమ్మలోనిగూడ గేట్ వద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పెంటికి తీవ్ర గాయాలై అక్కడే మృతి చెందగా, అమర్‌సింగ్‌కు సైతం తీవ్రగాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము


ప్రచారం నిర్వహిస్తున్న రాము, నాయకులు

షాబాద్: నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా మహేందర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ నేతృత్వంలో కేంద్ర సంక్షేమ పథకాల పట్ల ఇప్పుడే యువకులకు అవగాహన ఏర్పడుతోందన్నారు. దేశం కోసం ధర్మం కోసం బీజేపీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పేద, బడుగువర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో అత్యధిక మెజార్టీతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, రాజు, నరేష్, శంకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల సమర్పణ


నామినేషన్ సమర్పిస్తున్న పద్మావతి


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సాహితి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: చేవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా చెంచురెడ్డి పద్మావతి రాంజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్‌ఓ, కలెక్టర్ శశాంకకు బుధవారం నామినేషన్ సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థిగా దాసరి సాహితి నామినేషన్ దాఖలు చేశారు.

బీఎంపీ అభ్యర్థిగా నామినేషన్


నామినేషన్ వేస్తున్న బీఎంపీ అభ్యర్థి

అనంతగిరి: బహుజన్ ముక్తి పార్టీ(బీఎంపీ) చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా పాత్లావత్ గోవింద్‌నాయక్ బుధవారం నామినేషన్ వేశారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దాస్ రామ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్, ముక్తి మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పాత్లావత్ గట్యానాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.



వారెవ్వా చెట్టు.. అరుణం మెరిసేట్టు!

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు రోడ్డు కిరువైపులా ఉన్న వృక్షాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. విరబూసిన పూలతో ప్రయాణం ఆహ్లాదకరంగా వారు సాగిస్తున్నారు. గునుగల్ అటవీ ప్రాంతం క్రీడా క్షేత్రం సమీపంలో ఓ చెట్టు ఎర్రని పుష్పాలతో చూపరులను కట్టి పడేస్తోంది.

– యాచారం

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అనంతగిరి: వికారాబాద్ పట్టణ పరిధిలోని కొత్తగడి గ్రామ పరిధిలో బుధవారం అనుమానాస్పదంగా ఓ గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమయ్యిందని సీఐ నాగరాజు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా మృతుడు 40–45 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటుందని, యాష్ కలర్ షర్ట్, క్రీమ్ కలర్ ప్యాంట్ కలిగి ఉన్నాడని తెలిపారు. ఎవరైనా శవాన్ని గుర్తిస్తే ఫోన్ నంబర్‌ను 8712670030 సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఔటర్ సర్వీస్‌పై వ్యాన్ దగ్ధం


బొంగ్లూర్ ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో దగ్ధమవుతున్న వాహనం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- నడిరోడ్డుపై చెలరేగిన మంటలు
- ట్యాంకర్ రావడంతో తప్పిన ప్రాణనష్టం

ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై ఓమిని వ్యాన్ దగ్ధమైంది. వాహనం కింది భాగం నుంచి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై కారు లోంచి దూకి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మొట్లంపల్లి గ్రామానికి చెందిన కురువ మనోహర్ స్థానికంగా మన్నెగూడలో నివాసం ఉంటూ పండ్ల వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ మేరకు ఆయనకున్న ఓమిని వాహనంలో పండ్లు వేసుకొస్తారు. ఇదే క్రమంలో బుధవారం మన్నెగూడ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్తుండగా బొంగ్లూర్ ఔటర్ సర్కిల్ సర్వీస్ రోడ్డు వద్దకు రాగానే కారులో మంటలు చెలరేగాయి. గమనించిన మనోహర్ వెంటనే కారు లోంచి బయటికి దూకేశారు. మంటలు పెద్దగా వ్యాప్తి చెందడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. వెనకాలే ట్యాంకర్ రావడంతో నీరు పోసి మంటలు ఆర్పారు. అంతలోనే ఫైరింజన్ వచ్చి మంటలు పూర్తిగా కట్టడి చేసింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బాలికపై లైంగిక దాడి

- గర్భం దాల్చిన పదోతరగతి విద్యార్థిని

బషీరాబాద్: ఓ బాలికపై లైగింక దాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16) ఇటీవల పదోతరగతి పూర్తి చేసుకుంది. అదే గ్రామానికి చెందిన కర్రె నరేష్(24) ఆటో డ్రైవర్ బాలికకు ప్రేమపేరుతో మాయమాటలు చెబుతూ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆమె గర్భందాల్చింది. బాలిక తీరుపై అనుమానం వచ్చిన తల్లిదండ్రులు ప్రశ్నించగా అసలు విషయం చెప్పింది. దీంతో తల్లిదండ్రులు మూడు రోజుల కిందట గ్రామంలో పంచాయితీ పెట్టారు. బుధవారం బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE RANGA REDDY DISTRICT AT::L.B.NAGAR
O.S.No. 205 OF 2024

BETWEEN:-
Adipudi Srinath & another ...Plaintiffs
AND
1. Bandari Krishna
2. All Concerned ...Defendants

To,
All Concerned

You are hereby informed that Plaintiffs in the above suit had filed in the above said Hon'ble Court seeking for the relief of declare that the Plaintiffs are the sole legal heirs of late Adipudi Kousalya, w/o. Adipudi Veera Ram Kumar and to succeed to the Suit Schedule Property of said late Adipudi Kousalya, w/o. Adipudi Veera Ram Kumar i.e., **SUIT SCHEDULE-A PROPERTY:** All that piece and parcel of the Plots No.78, 79&80 admeasuring 2782 Sq.Yards, in Sy.No.533/A, 536/A, 535/AA, 535E, 533&533E, 536E3, 536/A1/1, situated at KALPAVRUKSHA, at Chilkur Village & Revenue, Moinabad Mandal, Ranga Reddy District, bounded by: **North:** 30' Wide Road, **South:** 30' Wide Road & Neighbours' land, **East:** Farm Plot No. 77&81, **West:** Neighbours' land; **SUIT SCHEDULE-B PROPERTY:** All that piece and parcel of the land admeasuring 500 Sq.Yards, equivalent to 418 Sq.Mtrs., of Plot No.229 in BlockB, in Layout of Sy.No.43P,44P,45,46&48, situated at KAVURI HILLS, Guttalabegumpet Village, Serilingampally Municipality & Mandal, Ranga Reddy District, bounded by: **North:** Plot No.230, **South:** Plot No.228, **East:** 80 feet wide Road, **West:** Plot No.220; **SUIT SCHEDULE-C PROPERTY:** All that property comprising Flat No. 401 (Fourth Floor) in VISHNU VEDA PLAZA consisting of super built-up area 1720 Sq.Feet including common areas and amenities etc., together with Undivided & unspecified share of land admeasuring 71.25 Sq.yds., or 59.57 Sq.Mtrs., out of the land admeasuring 600 Sq.Yards., or 501.67 Sq.Mtrs., one car parking space on stilt floor and also 1/3rd undivided & unspecified share in the another one car parking space on stilt Floor which is common in the premises bearing GHMC H.No.6-3-609/4, Anand Nagar, Khairathabad, Hyd., Telangana State, bounded by: **North:** Lift, Corridor & Staircase, **South:** Open to Sky, **East:** Open to Sky, **West:** Open to Sky. And the same is stood posted to 03.05.2024. If any person(s) had any objection to it, He/She/They may approach the above said Hon'ble Court by 10.30 a.m., on 03.05.2024 either in person or through their counsel duly instructed. Otherwise, the matter will be decided exparte.

BY ORDER OF THE HON'BLE COURT
B.VENKAT RAM REDDY, AMBATI JANAIAH
Advocates
CHAMBER OF LAWYERS COLLECTIVE, Beside DVM College, Siri Nagar, Colony, L.B. Nagar, Hyd.-35. Mobile No. 9542802304.